# మాతృభావన

**ప్రశ్నలు**

1. "పావనంబైన జనయిత్రి పాదజలము" అంటే ఏమిటి?
2. తల్లి పాదజలం దేనికంటే గొప్పదని తెలుసుకొన్నారు? ఎందుకు?
3. కుమారునికి అన్నింటికంటే ఏది మిన్న? ఎందుకు?
4. ఈ పద్యం ద్వారా తల్లికిగల స్థానమేమిటని గ్రహించారు?
5. "ప్రతి స్త్రీమూర్తి మనకు తల్లితో సమానం" అని ఎందుకంటారు?

**నేపథ్యం**

మొదటి దండయాత్రలో 'కళ్యాణి' దుర్గం జయించిన తరువాత అబ్బాజీసోన్‌దేవుడు, విజయోత్సాహంతో శివాజీ వద్దకు వస్తాడు. అప్పుడు సోన్‌దేవుడు శివాజీతో "దేవా మీ ఆజ్ఞ ప్రకారం కళ్యాణిని జయించి దాని సర్దారులను పట్టి బంధించి, సర్వస్వాన్నీ, రాణివాస స్త్రీలను బందీలుగా తెచ్చాను" అని మనవి చేశాడు. ఇది విన్న శివాజీ పరస్త్రీలు తల్లులతో సమానం అని చెప్పి, ఆమెకు అగౌరవం కల్గించినందుకు చింతిస్తూ, ఇలా చేయడం తగదని హితవు పలికిన సందర్భంలోనిదీ పాఠ్యాంశం.

**కవి పరిచయం**

ఆధునికాంధ్ర కవుల్లో ప్రముఖులు, శతావధాని డా॥ గడియారం వేంకటశేషశాస్త్రి. ఈయన తల్లిదండ్రులు - నరసమాంబ, రామయ్యలు. కడపజిల్లా, జమ్మలమడుగు తాలూకా నెమళ్ళ దిన్నె గ్రామంలో జన్మించాడు.

ఈయన దుర్భాక రాజశేఖర శతావధానితో కలసి కొన్ని కావ్యనాటకాలు రాశాడు. గడియారం వారి పేరు చెప్పగానే "శ్రీ శివభారతము" కావ్యం గుర్తుకు వస్తుంది. పారతంత్ర్యాన్ని నిరసించి స్వాతంత్ర్య కాంక్షను అణువణువునా రగుల్కొల్పిన మహాకావ్యం ఇది. 'మురారి', 'పుష్పబాణవిలాసము', 'రఘునాథీయము', 'మల్లికామారుతము' మొదలైన కావ్యాలు, 'వాస్తు జంత్రి' (అముద్రిత వచన రచన), 'శ్రీనాథ కవితా సామ్రాజ్యము' (విమర్శ) ఈయన లేఖిని నుండి వెలువడ్డాయి. 'కవితావతంస', 'కవిసింహ', 'అవధాన పంచానన' అనే బిరుదులను అందుకున్నాడు.

శా. "ఆ-యేమీ? యొక్క రాణివాసమును బుణ్యావాసమున్ దెచ్చినా
వా? యేహైందవుఁడైన నీ గతి నమర్యాదన్ బ్రవర్తించునే?
మా యాజ్ఞన్ గమనింపవో? జయ మదోన్మాదంబునన్ రేఁగి, నీ
యాయుస్సూత్రము లీవ త్రుంచుకొనెదో? యౌద్ధత్య మోర్వన్ జుమీ"

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| ఆ + ఏమి | = | (ఆశ్చర్యం, కోపంతో) ఆఁ ఏమిటీ? |
| పుణ్య + ఆవాసమున్ | = | పుణ్యానికి నిలయమైన |
| ఒక | = | ఒకానొక |
| రాణివాసమును | = | అంతఃపురమును (మహారాణిని) |
| తెచ్చినావు + ఆ | = | (బంధించి) తీసుకొని వచ్చావా? |
| ఏ హైందవుడు + ఐనన్ | = | ఏ హిందువైనా (భారతీయుడెవరైనా) |
| ఈ గతిన్ | = | ఈ విధంగా |
| అమర్యాదన్ | = | గౌరవం లేకుండా |
| ప్రవర్తించును + ఏ | = | ప్రవర్తిస్తాడా? (ప్రవర్తించడు) |
| మా + ఆజ్ఞన్ | = | మా ఆజ్ఞను (రాజాజ్ఞను) |
| గమనింపవు + ఓ | = | పట్టించుకోవా? |
| జయ | = | జయం వలన |
| మద | = | గర్వంతో |
| ఉన్మాదంబునన్ | = | మితిమీరిన పిచ్చితనముతో |
| రేఁగి | = | విజృంభించి |
| నీ | = | నీ యొక్క |
| ఆయుస్సూత్రములు | = | ఆయుర్దాయువు నూలిపోగులు (ప్రాణాలు) |
| ఈవ | = | నీవే |
| త్రుంచుకొనెదు + ఓ | = | త్రెంచుకొంటావా? |
| ఔద్ధత్యము | = | గర్వంతో చేసే పనులను |
| ఓర్వన్ | = | సహించను |
| చుమీ | = | సుమా! |

తాత్పర్యం : "ఆ-ఏమిటీ? పుణ్యానికి నిలయమైన ఒక రాణి వాసాన్ని బంధించి తీసుకొనివచ్చావా? ఏ భారతీయుడైనా ఈ విధంగా గౌరవం లేకుండఎడా ప్రవర్తిస్తాడా? రాజాజ్ఞను కూడా పట్టించుకోవా? జయం వలన గర్వంతో, మితిమీరిన పిచ్చితనంతో విజృంభిస్తావా? నీ ప్రాణాలు నీవే త్రెంచుకొంటావా? గర్వాన్ని సహించను సుమా!" అని శివాజీ, సోన్‌దేవునితో ఆగ్రహంగా అన్నాడు.

మ. అనుచున్ జేవుఱుమీఱు కన్నుఁగవతో నాస్పందదోష్ఠంబుతో
ఘన హుంకారముతో నటద్భ్రుకుటితో గర్జిల్లు నా భోన్సలే
శునిఁ జూడన్ బుయిలోడెఁ గొల్వు, శివుఁడీసున్ గుత్తుకన్ మ్రింగి, బో
రన నవ్వారల బంధ మూడ్చి గొనితేరన్ బంచె సోన్‌దేవునిన్

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| అనుచున్ | = | పై విధంగా పలుకుతూ |
| జేవుఱుమీఱు | = | బాగా (కోపంతో) ఎరుపెక్కిన |
| కన్నున్ + కవతో | = | రెండు కళ్లు కలవాడై |
| ఆస్పందత | = | పూర్తిగా అదురుచున్న |
| ఓష్ఠంబుతో | = | పై పెదవి కలవాడై |
| ఘన | = | గొప్పదైన |
| హుంకారంబుతో | = | హుంకరిస్తూ |
| నటత్ | = | కదలుచున్న |
| భ్రుకుటితో | = | బొమముడి కలవాడై |
| గర్జిల్లున్ | = | గర్జిస్తున్న |
| భోన్సలేశునిన్ | = | శివాజీని |
| చూడన్ | = | చూచుటకు |
| కొల్వు | = | రాజసభ |
| పుయిలోడెన్ | = | సంకోచించెను (జంకెను) |
| శివుడు | = | శివాజీ |
| ఈసున్ | = | కోపమును |
| కుత్తుకన్ | = | గొంతులో |
| మ్రింగి | = | మ్రింగి |
| సోన్‌దేవునిన్ | = | సోన్‌దేవుని |
| బోరన | = | శీఘ్రముగా (వెంటనే) |
| ఆ + వారల | = | ఆ రాణివాసము యొక్క |
| బంధము + ఊడ్చి | = | సంకెళ్లు తీయించి |
| కొనితేరన్ | = | తీసుకొని వచ్చుటకు |
| పంచె | = | ఆజ్ఞాపించెను |

తాత్పర్యం : పై విధంగా పలుకుచున్న శివాజీ కళ్లు ఎఱ్ఱబడ్డాయి. పై పెదవి అదురుతోంది. కదులుతున్న బొమముడితో హుంకరిస్తూ గర్జిస్తున్నాడు. అటువంటి శివాజీని చూడడానికి రాజసభ జంకింది. శివాజీ తన కోపాన్ని గొంతులోనే మ్రింగాడు. వెంటనే వెళ్ళి ఆ రాణి వాసమును విడిపించి తీసుకొని రమ్మని సోన్‌దేవుని ఆజ్ఞాపించాడు.

మ. త్వరితుండై యతఁ డట్టులే సలిపి "దేవా! నన్ను మన్నింపు, మీ
సరదారున్ గొని తెచ్చుచో సరభసోత్సాహంబు కన్గప్పె, దు
శ్చరితాలోచన లేదు, లేదు భవదాజ్ఞా లంఘనోద్వృత్తి, మీ
చరణద్వంద్వము లాన" యంచు వినిపించన్, సుంత శాంతించుచున్

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| త్వరితుండు + ఐ | = | తొందర కలవాడై |
| అతడు | = | ఆ సోన్‌దేవుడు |
| అట్టులే | = | ఆ విధంగానే (శివాజీ చెప్పినట్లుగానే) |
| సలిపి | = | చేసి |
| దేవా | = | దేవా (శివాజీని దైవమా! అని సంబోధించి) |
| నన్ను | = | నన్ను (సోన్‌దేవుని) |
| మన్నింపుము | = | అపరాధమును క్షమింపుము |
| ఈ సరదారున్ | = | (ఓడిపోయిన) ఈ వీరుడిని |
| కొని తెచ్చుచో | = | తీసుకొని వచ్చేటపుడు |
| సరభస + ఉత్సాహంబు | = | ఉవ్విళ్ళూరు ఉత్సాహము |

www.sakshieducation.com

కన్గప్పె = కళ్లకు కమ్మేసింది
దుస్ + చరిత + ఆలోచన = చెడు చేయాలనే తలంపు
లేదు = లేదు
మీ = తమ యొక్క
చరణద్వంద్వంబులు = పాదాలు
ఆన = సాక్షి
భవత్ = తమ యొక్క
ఆజ్ఞ = ఆజ్ఞను
ఉల్లంఘన = అతిక్రమించాలనే
ఉద్వృత్తి = గర్వము
లేదు = లేదు
అంచు = అనుచు
వినిపించన్ = నివేదించగా
సుంత = కొద్దిగా
శాంతించుచున్ = శాంతిని పొందినవాడై (కోపం తగ్గినవాడై)

తాత్పర్యం : శివాజీ ఆజ్ఞాపించిన పనిని సోన్‌దేవుడు తొందరగా చేశాడు. "దేవా! నన్ను మన్నించండి. ఓడిపోయిన ఈ వీరుడిని బంధించి తెచ్చేటప్పుడు ఉవ్విళ్ళూరు ఉత్సాహం కళ్లకు క్రమ్మేసింది. మీ పాదాల సాక్షిగా నాకు చెడు చేయాలనే ఆలోచన లేదు. తమ ఆజ్ఞను అతిక్రమించాలనే గర్వంలేదు." అని నివేదించగా శివాజీ కొద్దిగా శాంతించాడు.

ఆలోచించండి - చెప్పండి.

1. 'విజయగర్వంతో నీవు చేసిన పని సరికాదని' అనే మాటలను బట్టి శివాజీ ఎలాంటివాడని భావిస్తున్నారు?
2. స్త్రీలపట్ల మర్యాదగా ప్రవర్తించడం అంటే ఏమిటి?
3. శివాజీ కోపానికి కారణమేమిటి? కోపంలో శివాజీ ఎలా ఉన్నాడూ?
4. "సరభసోత్సాహంబు కన్గప్పె" అంటే మీకేమర్థమైంది?

మ. శివరాజంతట మేల్ముసుంగుఁ దెరలో - స్నిగ్ధాంబుదచ్ఛాయలో
నవసౌదామినిఁ బోలు నా యవనకాంతారత్నమున్ భక్తి గౌ
రవముల్ వాఱఁగఁ జూచి పల్కె "వనితారత్నంబు లీ భవ్యహైం
దవభూజంగమ పుణ్యదేవతలు, మాతా! తప్పు సైరింపుమీ!"

ప్రతిపదార్థం :

అంతట = అప్పుడు
శివరాజు = ఛత్రపతి శివాజీ
మేల్ముసుంగు = పైన గల ముసుగు అనెడు
తెరలో = పరదాలో
స్నిగ్ధ = దట్టమైన
అంబుద = మేఘముల యొక్క
ఛాయలో = నీడలో
నవ సౌదామినిన్ = క్రొత్త మెరపు తీగను
పోలున్ = పోలినటువంటి
ఆ యవన కాంతారత్నమున్ = యవన జాతికి చెందిన శ్రేష్ఠమైన ఆ స్త్రీని
భక్తి గౌరవముల్ = భక్తియును, గౌరవమును
వాఱగన్ = ప్రవహించగా (ఎక్కువ కాగా)
చూచి = ఆమె వైపు చూచి
వనితారత్నంబులు = స్త్రీలు
ఈ భవ్య = ఈ యోగ్యమైన
హైందవ భూ = హిందూ భూమిపై (భారతదేశంలో)
జంగమ = తిరిగెడు, కదిలెడు
పుణ్యదేవతలు = పవిత్రమైన దేవతాస్వరూపులు
మాతా! = తల్లీ!
తప్పు సైరింపుము+ఈ = మా తప్పును సహించుము
పల్కె = అని పల్కెను

www.sakshieducation.com

తాత్పర్యం : అప్పుడు ఛత్రపతి శివాజీ మేలిముసుగు పరదాలోని స్త్రీని చూశాడు. ఆమె దట్టమైన మేఘాల నీడలో క్రొత్త మెరుపు గీత వలె ఉంది. భక్తి గౌరవాలు పొంగిపొర్లగా ఆ యవనకాంతను చూశాడు. "ఈ భారతదేశంలో స్త్రీలు – సంచరించే పవిత్రమైన దేవతాస్వరూపులు తల్లీ! మా తప్పును సహించు" అని అన్నాడు.

సీ. హరి హర బ్రహ్మలఁ బురిటిబిడ్డలఁ జేసి
జోలఁబాడిన పురంధ్రీలలామ,
యమధర్మరాజుపాశముఁ ద్రుంచి యదలించి
పతిభిక్ష గొన్న పావనచరిత్ర,
ధగధగ ద్దహనమధ్యము పూలరాసిగా
విహరించియున్న సాధ్వీమతల్లి,
పతి నిమిత్తము సూర్యభగవానును దయంబు
నరికట్టి నిలుపు పుణ్యములపంట,
తే. అట్టి యెందఱో భరతాంబ యాఁడుబిడ్డ
లమల పతిదేవతాత్వ భాగ్యములు వోసి
పుట్టినిలు మెట్టినిలుఁ బెంచు పుణ్యసతులు
గలరు, భారతావని భాగ్యకల్పలతలు

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| హరిహర బ్రహ్మలన్ | = | విష్ణువును, శివుని, బ్రహ్మను |
| పురిటి బిడ్డలన్ + చేసి | = | పసిపిల్లలుగా చేసి |
| జోలన్ | = | జోలపాటను |
| పాడిన | = | పాడినటువంటి |
| పురంధ్రీలలామ | = | శ్రేష్ఠురాలైన గృహిణి (అనసూయ) |
| యమధర్మరాజు | = | మృత్యుదేవత యొక్క |
| పాశమున్ | = | త్రాడును |
| త్రుంచి | = | త్రెంచి |
| అదలించి | = | గర్జించి |
| పతిభిక్షన్ | = | భర్తను భిక్షగా |
| కొన్న | = | సంపాదించిన |
| పావన చరిత్ర | = | పవిత్రమైన చరిత్ర గలది; (సావిత్రి) |
| ధగధగత్ | = | ధగధగ మండుచున్న |
| గహన మధ్యము | = | చితి మధ్యభాగము |
| పూలరాసిగా | = | పూలకుప్ప వలె |
| విహరించియున్న | = | సంచరించి ఉన్నటువంటి |
| సాధ్వీమ తల్లి | = | శ్రేష్ఠురాలైన స్త్రీ (సీత) |
| పతి నిమిత్తము | = | పతి కొరకు |
| సూర్యభగవానుని | = | సూర్యదేవుని యొక్క |
| ఉదయంబును | = | ఉదయమును |
| అరికట్టి | = | నిరోధించి |
| నిలుపు | = | నిలిపిన |
| పుణ్యముల పంట | = | తల్లిదండ్రుల పుణ్యఫలము (సుమతి) |
| అట్టి | = | అటువంటి |
| ఎందఱో | = | ఎంతోమంది |
| భరతాంబ | = | భరతమాత యొక్క |
| ఆఁడుబిడ్డలు | = | స్త్రీ సంతానం |
| అమల | = | స్వచ్ఛమైన |
| పతిదేవతాత్వ | = | పతివ్రతా ధర్మమనెడు |
| భాగ్యములు + పోసి | = | సంపదలను ఇచ్చి |
| పుట్టిన + ఇలు | = | పుట్టినింటిని |
| మెట్టిన + ఇలున్ | = | అత్తవారింటిని |
| పెంచు | = | అభివృద్ధి చేయు |
| భరత + అవని | = | భారతదేశము యొక్క |
| భాగ్య కల్పలతలు | = | సంపద అనెడు దేవతావృక్షాల వంటి |

www.sakshieducation.com

| | | |
|---|---|---|
| పుణ్యసతులు | = | పుణ్యాత్ములైన స్త్రీలు |
| కలరు | = | ఉన్నారు |

తాత్పర్యం : బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను పసిపిల్లలుగా చేసి నిద్రపుచ్చినది అనసూయ అను పేరు గల ఒక గృహిణి. యమధర్మరాజు పాశమును కూడా త్రెంచి, గర్జించి, పతి ప్రాణాలు సాధించిన పవిత్రమైన చరిత్ర కలది సావిత్రి. నిప్పుల రాశి మధ్యను పూలరాశిగా సంచరించిన శ్రేష్ఠురాలైన స్త్రీ సీత. పతిప్రాణాలు కాపాడడానికి సూర్యోదయాన్ని నిలిపిన పుణ్యాత్మురాలు సుమతి. అటువంటి భరతమాత సంతానమైన స్త్రీలు స్వచ్ఛమైన పతివ్రతలు. వారి పాతివ్రత్య మహిమతో పుట్టింటిని, అత్తవారింటిని అభివృద్ధి చేస్తున్నారు. వారు ఈ భారతదేశపు సంపదలనెడు దేవతావృక్షాలు. అటువంటి పుణ్యస్త్రీలు ఉన్నారు.

మ. అనలజ్యోతుల నీ పతివ్రతలఁ బాపాచారులై డాయు భూ
జనులెల్లన్ నిజసంపదల్ దొఱఁగి యస్తధ్వస్తులై పోరె? వి
త్తనమే నిల్చునె? ము న్నెఱుంగమె పులస్త్యబ్రహ్మసంతాన? మో
జననీ! హైందవ భూమి నీ పగిది దుశ్చారిత్రముల్ సాగునే?

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| ఓ జననీ! | = | ఓ తల్లీ! |
| పాప + ఆచారులు + ఐ | = | పాపము చేయుట ఆచారముగా గలవారై |
| అనల జ్యోతులను | = | అగ్నికాంతుల వంటి (అగ్ని వంటి తేజస్సుగల) |
| ఈ పతివ్రతలను | = | పాతివ్రత్యం గల పుణ్యస్త్రీలను |
| డాయు | = | సమీపించు |
| భూజనులు + ఎల్లన్ | = | భూమిపై నున్న మానవులందరూ |
| నిజ సంపదల్ | = | తమ సంపదలు |
| తొఱగి | = | తొలగి |
| అస్త ధ్వస్తులు + ఐ | = | మరణించి, నాశనమై |
| పోరె | = | పోరా (పోతారు) |
| విత్తనము + ఏ | = | వంశమైనా, సంతానమైనా |
| నిల్చునె? | = | నిలబడుతుందా? (నిలబడదు) |
| మున్ను | = | ఇంతకుముందు |
| పులస్త్యబ్రహ్మసంతానము | = | పులస్త్యబ్రహ్మ యొక్క సంతానమైన రావణాసుర వంశం |
| ఎఱుంగము + ఎ | = | (ఏ విధంగా నశించిందో) ఎఱుగమా! (ఎఱుగుదుము) |
| ఈ పగిది | = | ఈ విధమైన |
| దుస్ + చారిత్రముల్ | = | చెడు ప్రవర్తనలు |
| హైందవ భూమిని | = | హిందూదేశంలో (భారతదేశంలో) |
| సాగును + ఏ | = | సాగుతాయా! (సాగవు) |

తాత్పర్యం : అగ్నికాంతితో ప్రకాశించు పతివ్రతలను పాపపు ఆచారం కలవారై సమీపించకూడదు. అలా సమీపించిన వారు తమ సంపదలను కోల్పోతారు. మరణిస్తారు. నశిస్తారు. వంశం కూడా నిలబడదు. పూర్వం, పులస్త్యబ్రహ్మ సంతానమైన రావణాసురుని వంశం నశించడం తెలియదా? భారతదేశంలో ఈ విధమైన చెడు నడతలు సాగవు.

ఆలోచించండి - చెప్పండి

1. స్త్రీలను ఎవరితో పోల్చారు? ఎందుకు?
2. స్త్రీల పట్ల సమాజంలో ఎలాంటి అభిప్రాయాలు ఉన్నాయి? దీనిపై మీ అభిప్రాయాలు తెల్పండి.
3. స్త్రీల వల్ల భారత కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతున్నాయనడానికి ఉదాహరణలు తెల్పండి.
4. "అనలజ్యోతుల ........... సాగునే?" అనే పద్యం ద్వారా మీకేమర్థమైంది?

తే. యవన పుణ్యాంగనామణి వగుదుగాక
హైందవులపూజ తల్లియట్లందరాదె?
నీదురూపము నాయందు లేద యైనఁ
గనని తల్లివిగా నిన్ను గారవింతు

శా. మా సర్దారుఁడు తొందరన్ బడి యసన్మార్గంబునన్ బోయె, నీ
దోసంబున్ గని నొచ్చుకోకు, నినుఁ జేర్తున్ నీ గృహం బిప్పుడే,
నా సైన్యంబును దోడుగాఁ బనిచెదన్, నాతల్లిగాఁ దోడుగా,
దోసిళ్లన్ నడిపింతు, నీ కనులయందున్ దాల్మి సారింపుమీ!"

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| తల్లీ | = | ఓ మాతా! |

www.sakshieducation.com

మా సర్దారుడు = మా వీరుడు (సోన్‌దేవుడు)
తొందరన్ + పడి = కంగారు పడి
అసత్ + మార్గంబునన్ = మంచిది కాని దారిలో
పోయెను = ప్రయాణించెను
ఈ దోసంబున్ = ఈ తప్పును
కని = చూచి
నొచ్చుకోకు = బాధపడకు
ఇప్పుడే = వెంటనే
నినున్ = నిన్ను
నీ గృహంబు = నీ ఇంటికి
చేర్తున్ = చేరుస్తాను
నా సైన్యంబును = నా యొక్క సైన్యాన్ని
తోడుగాన్ = నా సహోదరి వలె
దోసిళ్లన్ = అరచేతులపై
నడిపింతు = నడిపిస్తాను
నీ కనుల + అందున్ = నీ చూపులో
తాల్మి = ఓర్పును, క్షమను
సారింపుము = ప్రదర్శించుము

తాత్పర్యం : మా వీరుడు కంగారు పడి చెడుమార్గంలో ప్రయాణించాడు. ఈ తప్పును చూచి బాధపడకు. వెంటనే నీ ఇంటికి చేరుస్తాను. నా సైన్యాన్ని నీకు సహాయంగా పంపుతాను. నా తల్లిని వలె, నా సోదరిని వలె నిన్ను అరచేతులపై నడిపిస్తాను. నీ చూపులలో ఓర్పును ప్రదర్శించుము అమ్మా! అని శివాజీ అన్నాడు.

మ. అని కొండాడి, పతివ్రతా హిత సపర్యాధుర్యుఁడాతుండు యా
వన కాంతామణి కర్హసత్కృతు లొనర్పన్ జేసి, చేసేతఁ జి
క్కిన సర్దారుని గారవించి హితసూక్తిన్ బల్కి, బీజాపురం
బునకున్ బోవిడె - వారితోఁ దనబలంబుల్ గొన్ని తోడంపుచున్

ప్రతిపదార్థం :

అని = పై విధంగా పలికి
కొండాడి = స్తుతించి
పతివ్రతా = పతివ్రతల యొక్క
హిత = ఇష్టమునకు
సపర్యా = పూజ అనెడు
ధుర్యుడు = భారము వహించువాడు
ఆతండు = ఆ శివాజీ
యావన = యవన సంబంధమైన
కాంతామణికి = శ్రేష్ఠురాలైన ఆ స్త్రీకి
అర్హ = తగినటువంటి
సత్కృతులు = గౌరవాదరాలు
ఒనర్పన్ = అతిశయించునట్లు
చేసి = చేసి
చేత + చేత = చేతులారా
చిక్కిన = తనకు బందీ అయిన
సర్దారుని = (ఓడిపోయిన) వీరుని
గారవించి = గౌరవించి
హిత = మంచిని కల్గించే
సు + ఉక్తిన్ = మంచి మాటను
పల్కి = చెప్పి
తన బలంబుల్ = తన సైన్యము
కొన్ని = కొంత
వారితో = ఆ యవన దంపతులతో
తోడు + అంపుచున్ = సహాయంగా పంపుతూ
బీజాపురంబునకున్ = బీజాపూర్‌కు
పోన్ + విడె = పోవుటకు విడిచిపెట్టెను.

www.sakshieducation.com

తాత్పర్యం : శివాజీ పై విధంగా ఆ యవన కాంతను స్తుతించాడు. పతివ్రతల ఇష్టానికి తగినట్లు పూజించాడు. ఆ యవనకాంతకు తగిన గౌరవ మర్యాదలు చేశాడు. తనకు చిక్కిన వీరుడైన ఆమె భర్తను గౌరవించాడు. మంచి మాటలు చెప్పాడు. వారికి సహాయంగా తన సైన్యం కొంత పంపాడు. వారిని బీజాపూర్ వెళ్ళడానికి విడిచిపెట్టాడు.

మ. శివరా జంతట సోనదేవుమొగమై "స్త్రీరత్నముల్ పూజ్య, లే
యవమానంబు ఘటింపరా, దిది మదీయాదర్శ మస్మచ్చమూ
ధవు లీయాజ్ఞ నవశ్య మోమవలె, నీతాత్పర్యమున్ జూచి, లో
కువ చేకూరమి నెంచి, నీయెడ దొసంగు ల్లేమి భావించితిన్" (అని వాక్రుచ్చెను).

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| అంతట | = | అంతలో |
| శివరాజు | = | ఛత్రపతి శివాజీ |
| సోనదేవు మొగమై | = | సోన్‌దేవును వైపు తిరిగి |
| స్త్రీ రత్నముల్ | = | శ్రేష్ఠులైన స్త్రీలు |
| పూజ్యులు | = | పూజింప తగినవారు |
| ఏ అవమానంబు | = | ఏ విధమైన అవమానమును |
| ఘటింపరాదు | = | జరుగరాదు |
| ఇది | = | ఈ పద్ధతి |
| మదీయ | = | నా యొక్క |
| ఆదర్శము | = | ఆశయము |
| అస్మత్ | = | నా యొక్క |
| చమూధవులు | = | సైన్యాధికారులు |
| ఈ + ఆజ్ఞను | = | ఈఉత్తర్వును |
| అవశ్యము | = | తప్పనిసరిగా |
| ఓమవలె | = | రక్షించాలి |
| నీ తాత్పర్యమున్ | = | నీ భావమును |
| చూచి | = | పరిశీలించి |
| లోకువ | = | తక్కువ |
| చేకూరమిన్ | = | కలుగపోవుటను |
| ఎంచి | = | పరిశీలించి |
| నీ + ఎడ | = | నీ పట్ల |
| దొసంగుల్ + లేమి | = | తప్పులు లేకపోవుటను |
| భావించితిన్ | = | గ్రహించితిని |

తాత్పర్యం : అపుడు ఛత్రపతి శివాజీ సోన్‌దేవుని వైపు తిరిగి, "స్త్రీలు పూజ్యనీయులు. వారికి ఏ అవమానం జరగకూడదు. ఇది నా ఆశయం. మన సైన్యాధికారులందరూ ఈ ఆజ్ఞను రక్షించాలి. నీ భావం గ్రహించాను. మమ్ము తక్కువ చేయకపోవుటను తెలుసుకొన్నాను. నీ తప్పు లేదని గ్రహించాను" అన్నాడు.

ఆలోచించండి - చెప్పండి

1. తల్లిగా గౌరవించడం అంటే ఏమిటి? ఆ ప్రవర్తన ఎలా ఉంటుంది?
2. సన్మార్గంలో నడవడం అంటే ఏమిటి? విద్యార్థులుగా మీరు చేయాల్సిన కొన్ని పనులను తెల్పండి.
3. "స్త్రీరత్నముల్ పూజ్య, లే యవమానంబు ఘటింపరాదు," అంటే ఏమిటి?
4. "హితసూక్తిన్ బల్కి" అంటే ఏమిటి?

భావాలు

1. ఆ .... ఏమిటి? పుణ్యానికి నిలయమైన ఒక రాణివాసాన్ని బందీగా తెచ్చావా? ఏ హైందవుడైనా ఈ విధంగా మర్యాద తప్పి ప్రవర్తిస్తాడా? నా ఆజ్ఞను నీవు గమనించలేదా? విజయగర్వం మత్తులో చెలరేగి నీ ప్రాణానికి నీవే ఆపద తెచ్చుకొంటావా? నీవు చేసిన ఈ పనిని నేను సహించను.
2. అంటూ ఎర్రబడిన కన్నులతో, అదిరిపడే పై పెదవితో, గొప్ప హుంకారముతో, కదలాడే కనుబొమ్మ ముడితో గర్జిస్తూన్న భోంసలేశుని చూసి సభంతా నిశ్చేష్టితమైంది. శివాజీ తన కోపాన్నంతా దిగమింగి "వెళ్ళి వారి బంధనాలు తొలగించి ఇక్కడకు తీసుకురండి" అని సోన్‌దేవుని పంపించాడు.
3. సోన్‌దేవుడు త్వరత్వరగా శివాజీ ఆజ్ఞను పాటించి "దేవా! నన్ను మన్నించండి. ఈ సర్దారును పట్టి తెచ్చే ఉత్సాహ తీవ్రత నా కళ్ళను కప్పేసింది. అంతేగాని ఇందులో ఎటువంటి చెడు ఆలోచన నాకు లేదు. మీ ఆజ్ఞను మీరి ప్రవర్తించాలనే ఉద్దేశం కూడా లేదు. మీ పాదాల మీద ఒట్టు" అని మనవి చేయగా, శివాజీ కొంత శాంతిస్తూ.

www.sakshieducation.com

4. అంతలోనే మేలిముసుగు తెరలో దట్టమైన నీలిమేఘం మాటున ఉన్న మెరుపుతీగ లాంటి యవనస్త్రీని భక్తి గౌరవాలతో చూస్తూ ఇలా అన్నాడు "స్త్రీలు శుభప్రదమైన ఈ హైందవభూమిపై సంచరించే పుణ్యదేవతలు. అమ్మా ఈ తప్పును మన్నించు".
5. త్రిమూర్తులను (బ్రహ్మ విష్ణు మహేశ్వరులు) తన పాతివ్రత్యంతో చంటిబిడ్డలుగా చేసి వారికి జోలపాడిన మహనీయురాలు (అనసూయ). యమధర్మరాజు పాశాన్ని ఎదిరించి తన భర్త ప్రాణాన్ని రక్షించుకున్న పావన చరిత (సావిత్రి). భగభగ మండే అగ్ని గుండంలో కూడా పూలరాసిలో తిరిగినట్టు తిరుగాడి బయటకువచ్చిన పతివ్రత (సీత). భర్తకోసం సూర్యభగవానుని ఉదయించకుండా నిలిపిన పుణ్యస్త్రీ (సుమతి). ఇలా భారతీయ స్త్రీలు ఎందరో తమ పాతివ్రత్యంతో పుట్టినింటికీ మెట్టినింటికీ కీర్తిని పెంచిన వారు ఉన్నారు. వారు భారతదేశానికి అదృష్టకల్పలతలు.
6. ఓ తల్లీ! అగ్నిజ్వాలల వంటి పతివ్రతలపట్ల అపచారం చేసేవారు తమసంపదలు కోల్పోయి నాశనమై పోరా? అసలు వంశం నిలుస్తుందా? పులస్త్యబ్రహ్మ సంతానమైన రావణాసురుని పతనం గురించి మనకు తెలియదా? భారతభూమిపై ఇటువంటి దుశ్చర్యలు సాగుతాయా? సాగవు.
7. నీవు యవన దేశ పుణ్యస్త్రీవి కావచ్చు. అయినా హైందవుల పూజను స్వీకరించు. నీ రూపం నాలో లేకపోయినా నన్ను కనని తల్లివి నీవు. నిన్ను నా తల్లిగానే గౌరవిస్తాను.
8. మా సర్దారు తొందరపాటు వల్ల జరిగిన ఈ దోషానికి బాధపడకు. నిన్ను ఇప్పుడే నీ ఇంటికి చేరుస్తాను. నా సైన్యాన్ని తోడుగా పంపిస్తాను. నా తల్లిగా భావించి నిన్ను దోసిళ్ళపై నడిపిస్తాను. నీ కన్నుల్లో సహనం పూనుం.
9. అని స్తుతించి పతివ్రతా స్త్రీల మంచిని కోరుకునే శివాజీ యవన స్త్రీకి తగిన సత్కారాలు జరిపించి, తన చేతికి చిక్కిన సర్దార్‌ను గౌరవించి వారితో మంచి మాటలు పలికి వారికి తోడుగా తన బలగాలను బీజాపురానికి పంపించాడు.
10. తరువాత శివాజీ సోన్‌దేవుని వైపు తిరిగి "స్త్రీలు పూజింప దగినవారు. వారికి ఏ అవమానం చేయగూడదు. ఇది నా ఆదర్శం. నా సైన్యాధిపతులందరూ ఈ ఆజ్ఞను తప్పని సరిగా ఆచరించాలి. నీ ఉద్దేశం చూసి, లోపం లేదని తలచి నీ తప్పేమీ లేదని భావించాను" అని అన్నాడు.

## I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది అంశాల గురించి చర్చించండి.
   అ) "ప్రస్తుతం స్త్రీలపై జరిగే దాడులకు కారణాలు - నివారణోపాయాలు"
   ఆ) "కుటుంబం - సమాజం అభివృద్ధిలో స్త్రీల పాత్ర".

2. గుర్తుగల పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి.

ఉదా॥ "ఆ-యేమీ? యొక్క రాణివాసమును బుణ్యావాసమున్ దెచ్చినా
వా? యే హైందవుఁ డైన నీగతినమర్యాదన్ బ్రవర్తించునే
మా యాజ్ఞన్ గమనింపవో? జయ మదోన్మాదంబునన్ రేఁగి, నీ
యాయుస్సూత్రము లీవ త్రుంచుకొనెదో? యౌద్ధత్య మోర్వన్ జుమీ,

ప్రతిపదార్థాలు

| | | |
|---|---|---|
| ఆ - యేమి | = | (ఆశ్చర్యం, కోపం కలిపి) ఆ ఏమిటి? |
| పుణ్య + ఆవాసమున్ | = | పుణ్యానికి నిలయమైన |
| ఒక | = | ఒక |
| రాణివాసమును | = | రాణివాసాన్ని |
| తెచ్చినావా | = | బందీగా తీసుకొచ్చావా? |
| ఏ హైందవుఁడు + ఐనను | = | హైందవుడు ఎవడైనా |
| ఈ గతిన్ | = | ఈ విధంగా |
| అమర్యాదన్ | = | మర్యాద తప్పి (మర్యాద లేకుండా) |
| ప్రవర్తించును + ఏ | = | ప్రవర్తిస్తాడా? |
| మా + ఆజ్ఞన్ | = | నా ఆజ్ఞను |
| గమనింపవు + ఓ | = | గమనించలేదా? (పట్టించుకోలేదా?) |
| జయ | = | (యుద్ధంలో) విజయం పొందిన |
| రేఁగి | = | అతిశయించి |
| నీ | = | నీ యొక్క |
| ఆయుః + సూత్రములు | = | ప్రాణాలనే సూత్రాలు (దారాలు) |
| ఈవ | = | నీవే |
| త్రుంచుకొనెదు + ఓ | = | తెంచుకుంటావా? |
| ఔద్ధత్యము | = | ఈ తెగింపును (ఏపు) |
| ఓర్వన్ + సుమీ | = | సహించను సుమా! |

తాత్పర్యం : "ఆ-ఏమిటీ? పుణ్యానికి నిలయమైన ఒక రాణివాసాన్ని బంధించి తీసుకొనివచ్చావా? ఏ భారతీయుడైనా ఈ విధంగా గౌరవం లేకుండా ప్రవర్తిస్తాడా? రాజాజ్ఞను కూడా పట్టించుకోవా? జయం వలన గర్వంతో మితిమీరిన పిచ్చితనంతో విజృంభిస్తావా? నీ ప్రాణాలు నీవే త్రెంచుకొంటావా? గర్వాన్ని సహించను సుమా!" అని శివాజీ, సోన్‌దేవునితో ఆగ్రహంగా అన్నాడు.



www.sakshieducation.com

3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.
   అ. శివాజీ కొలువులోని వారంతా నిశ్చేష్టులవడానికి కారణం ఏమిటి?
   ఆ. సోన్‌దేవుడు శివాజీని ఎలా శాంతపరిచాడు?
   ఇ. భారతదేశ భాగ్య కల్పలతలని శివాజీ ఎవరిని, ఎలా కీర్తించాడు?
   ఈ. శివాజీ యవన కాంత పట్ల చూపిన ఆదరాభిమానాలు ఎటువంటివి?

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.
   అ. సోన్‌దేవుని మనస్తత్వాన్ని గురించి పాఠం ఆధారంగా సొంతమాటల్లో రాయండి.

జ. రాణివాసాన్ని సోన్‌దేవుడు బంధించి తెచ్చినందుకు శివాజీ అనుగ్రహించాడు. వెంటనే వారిని విడిపించి తీసుకొని రమ్మని శివాజీ ఆజ్ఞాపించాడు. శివాజీ ఆజ్ఞానుసారం సోన్‌దేవుడు రాణివాసాన్ని వెంటనే బంధనాలు తొలగించి తీసుకొని వచ్చాడు. దీనిని బట్టి శివాజీ ఆజ్ఞను వెంటనే అమలు జరిపే నమ్మినబంటు సోన్‌దేవుడని తెలుస్తోంది. ముందు వెనుకలు ఆలోచించకుండా రాజభక్తితో రాజాజ్ఞను అమలు జరిపే మనస్తత్వం కలవాడు సోన్‌దేవుడు. సోన్‌దేవునకు స్వామిభక్తి ఎక్కువ.

"దేవా! నన్ను మన్నించు. ఈ వీరుడిని బంధించిన విజయం నా కళ్లకు కప్పింది. చెడు ఆలోచన లేదు. తమ ఆజ్ఞను ఉల్లంఘించే గర్వం లేదు. మీ పాదాల సాక్షిగా కావాలని తప్పుచేయలేదు" అన్నాడు సోన్‌దేవుడు శివాజీతో.

పై మాటలను బట్టి తను తప్పుచేస్తే సోన్‌దేవుడు క్షమార్పణ కోరతాడు. ఆత్మ విమర్శ చేసుకొని తన తప్పునకు కారణం తెలుసుకొంటాడు. సిగ్గుపడకుండా దానిని చెబుతాడు. అహంకారం లేదు. గర్వం లేదు. నిజాయితీ కలవాడు. నిర్భయంగా నిజం చెబుతాడు. మంచి స్వభావం గల సైన్యాధికారి. కొంచెం తొందరపాటు గలవాడు. తనను తాను సరిచేసుకుంటాడు.

ఆ. శివాజీ రాజై ఉండీ తన వద్దకు బందీగా తెచ్చిన యవన కాంతతో "మాతా! తప్పు సైరింపుమీ!" అన్నాడు. దీని మీద మీ అభిప్రాయాలేమిటి?

జ. శివాజీకి స్త్రీలంటే గౌరవం ఎక్కువ. స్త్రీలకు అవమానం జరిగితే సహించలేడు. దీనికి కారణం శివాజీ చిన్నతనం నుండి వినిన మంచి కథలు కావచ్చును. వాళ్ల అమ్మగారు పురాణ కథలు చెప్పి ఉండవచ్చును. మన భారతీయ సాహిత్యం చదివి ఉండవచ్చును. అందుచేతనే ఆ యవన కాంతను 'అమ్మా!' అని సంబోధించాడు. తన చదివిన ఉత్తమమైన సాహిత్యం అతనికి ఆ సంస్కారం నేర్పింది. అందుకే తను రాజునని కూడా మరచిపోయాడు. అహంకారం ప్రదర్శించలేదు. తన వలన తప్పు జరిగిందని తెలుసుకొన్నాడు. అందుకే క్షమార్పణ కోరాడు. ఇది శివాజీ ఉత్తమ సంస్కారానికి నిదర్శనం.

ఇ. "శివాజీ ఆదర్శం" లోని గొప్పతనాన్ని సొంతమాటల్లో రాయండి.

జ. స్త్రీలను ఏ రకంగానూ అవమానించడం శివాజీ సహించడు. ఇదే అతని ఆదర్శం. ఈ ఆదర్శం కోసమే జీవించాడు తన చేతికి చిక్కిన శత్రు సైనికుడి భార్యకు క్షమాపణ చెప్పాడు. ఆమెను సాదరంగా పంపాడు. శత్రువు భార్యను కూడా తల్లిగా భావించడం, సంబోధించడం అతని గొప్పతనం. ఒక స్త్రీకి అవమానం జరిగిందని, తన సైన్యాధికారిని కూడా కఠినంగా మందలించాడు. ఎట్టి పరిస్థితులలోనూ స్త్రీలకు అవమానం జరిగితే సహించనని హెచ్చరించాడు. శివాజీ ప్రవర్తనను ఆదర్శంగా తీసుకొంటే, సమాజం ఉన్నతంగా తీర్చిదిద్దబడుతుంది.

ఈ. మీ తోటి బాలికలను మీరెలా గౌరవిస్తారు?

జ. మా తోటి బాలికలను మాతో సమానంగా గౌరవిస్తాం. కలిసి ఆడుకొంటాం. చదువుకొంటాం. అల్లరి చేస్తాం. పాఠాలు వింటాం.

ఆడపిల్లలను అగౌరవించం. సహాయం చేస్తాం. మా అక్కచెల్లెళ్ళలా భావిస్తాం. ఏ అమ్మాయిలోనైనా మా అక్కనో, చెల్లినో చూస్తాం. ఎవరైనా అమ్మాయిల్ని అగౌరవపరిస్తే సహించం. కించపరిస్తే ఊరుకోం. ఆకతాయిలెవరైనా అల్లరి పెడితే, అందరం కలిసి బుద్ధి చెబుతాం. అమ్మాయిలు ధైర్యంగా ఉండేలాగా చేస్తాం. వారికి అన్నదమ్ములు లాగా తోడు నీడ ఔతాం.

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ. మీ పాఠం ఆధారంగా శివాజీ వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

జ. "ఆ – ఏమీ ఒక రాణివాసాన్ని బంధించి తెచ్చావా?" అని సోన్‌దేవుడుతో శివాజీ అన్నాడు. ఈ మాటలను బట్టి అతను స్త్రీలను అవమానిస్తే సహించడు. ఆగ్రహం వస్తుంది. ఎంతటి వారినైనా నిలదీస్తాడు. అటువంటి చర్యలకు దిగ్భ్రాంతి చెందుతాడు అని తెలుస్తోంది.

"ఏ హైందవుడైన నీగతి నమర్యాదన్ బ్రవర్తించునే?" అన్న మాటలను బట్టి హిందూదేశ వాసులు స్త్రీలంటే చాలా గౌరవమని తెలుస్తోంది. తాను భారతీయుడుగా జన్మించినందుకు శివాజీ చాలా గర్వపడేవాడు. సోన్‌దేవుడు చేసిన పని భారతీయతకు తగదని శివాజీ అభిప్రాయం.

"మా యాజ్ఞన్ గమనింపవో" అనే మాటను బట్టి, శివాజీకి చక్రవర్తికి ఉండవలసిన హుందాతనం ఉందని తెలుస్తోంది.

"నీ ఆయుస్సూత్రము లీవ త్రుంచుకొనెదో?" అనే వాక్యాన్ని బట్టి స్త్రీలను అవమానించిన వారిని చంపడానికైనా శివాజీ వెనుదీయడని తెలుస్తోంది. ఆ పని చేసినవారు ఎంత గొప్పవారైనా క్షమించడు. ఎంత బలవంతులతోనైనా పోరాడతాడు.

"అనుచున్ జేవుఱుమీఱు....." అనే పద్యంలో శివాజీ కోపం తెలుస్తోంది. అతని కళ్లు ఎఱ్ఱబడ్డాయి. పెదవులు అదిరాయి. హుంకరించాడు. గర్జించాడు. అతని కోపానికి రాజసభ మొత్తం భయపడింది. అంటే శివాజీ కోపం చాలా భయంకరంగా ఉండి తన ఏలుబడిలోని వారే స్త్రీలను అవమానించారంటే ఆ కోపం ఇంకా ఎక్కువౌతుంది.

సోన్‌దేవుడు క్షమార్పణ కోరాడు. అనేక విధాలుగా ప్రాధేయపడ్డాడు. అప్పుడు శివాజీ శాంతించాడు. అంటే శివాజీకి ఎంత కోపం వచ్చినా విచక్షణ మరచిపోడు. ఇతరులు చెప్పింది వింటాడు. వివేకంతో ఆలోచిస్తాడు. కోపం తగ్గించుకొంటాడు. శాంతిస్తాడు. జరిగిన తప్పును సరిచేసుకొనే మార్గాన్ని అన్వేషిస్తాడు.

అందుకే ఆ యవన కాంతను మన్నించమని కోరాడు. హిందూదేశస్థులకు స్త్రీలు చాలా పవిత్రమైన వారని చెప్పాడు. అనసూయ, సావిత్రి, సీత, సుమతుల వంటి మహాపతివ్రతలను ఉదాహరించాడు. పుట్టినింటికీ, మెట్టినింటికీ కీర్తి ప్రతిష్ఠలు పెంచే స్త్రీలను దేవతలన్నాడు. వారికి అపచారం తలపెడితే మరణం తప్పదన్నాడు. సర్వనాశనం తప్పదన్నాడు. అందుకు రావణాసురుని ఉదాహరించాడు.

ఇలాగ ఉత్తమ నాయకునికి ఉండవలసిన మంచి లక్షణాలన్నీ శివాజీలో ఉన్నాయి. కేవలం మాటల వ్యక్తి కాదు. తను నమ్మిన ఆశయం కోసం జీవించే వ్యక్తి. తన, పర అనే భేదం లేనివాడు. తన చేతల ద్వారా పదిమందికి మంచి మార్గం చూపినవాడు, పదిమందిని మంచి మార్గంలో నడిపించాడు. శివాజీ వంటి వ్యక్తి మండలానికి ఒక్కరున్నా స్త్రీలకు రక్షణ ఉంటుంది. భద్రత ఉంటుంది. గౌరవం పెరుగుతుంది. భరతమాత సంతోషిస్తుంది.

ఆ. “స్త్రీరత్నములు పూజ్యులు” అన్న శివాజీ మాటలను మీ సొంత అనుభవాల ఆధారంగా సమర్థించండి.

జ. తొమ్మిది నెలలు తన కడుపులో పెట్టుకొని మోసింది అమ్మ. మనకు జన్మనిచ్చింది అమ్మ. కంటిరెప్పలా కాపాడుతున్నది అమ్మ. అటువంటి అమ్మ నాకు పూజ్యురాలు.

ఒకసారి ఆటలలో భయపడ్డాను. ఇంటికి వెళ్ళినా భయం తగ్గలేదు. నాన్నకు చెప్పాను. పట్టించుకోలేదు. అమ్మకు చెప్పాను. దగ్గరగా తీసుకొని వెన్ను నిమిరింది. ధైర్యం చెప్పింది. లాలనగా అడిగింది. అసలు విషయం చెప్పాను. అదేమిటంటే మేము ఆడుకొనే చోట ఒక ఎముక కనిపించింది. అది తీశాను. అది ఎవరో చనిపోయిన వారిదని నా స్నేహితులు భయపెట్టారు. ఆ దెయ్యం నన్ను పట్టుకొంటుందని భయపెట్టారు. అదే చెప్పాను.

అమ్మ పకపకా నవ్వింది. ‘నీకు భయం లేదు చిన్నా’ అంది. హనుమంతుడంటే దెయ్యాలకు భయం అని చెప్పింది. హనుమంతుడు దెయ్యాలని తోకతో పట్టుకొని కొట్టేస్తాడంది. హనుమంతుని కథ చెప్పింది. ఊ కొడుతూ నిద్రపోయాను. నన్ను భయం నుండి కాపాడింది మా అమ్మ.

ఇలాగే ఎన్నోసార్లు మా అమ్మ ధైర్యం చెప్పింది. అందుకే అమ్మ నాకు పూజ్యురాలు, అలాగే మా అక్క కూడా. అనేక సార్లు నాకు సహాయపడింది.

తరగతిలో చెప్పిన పాఠ్యాంశాలు నాకు అర్థం కాకపోతే మా అక్కను అడుగుతాను. చక్కగా అరటిపండు ఒలిచిపెట్టినట్లు అర్థమయ్యేలా చెబుతుంది. నా అనుమానాలన్నీ పటాపంచలవుతాయి.

మాకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయినులు పాఠం చక్కగా అర్థమయ్యేలా చెబుతారు. కసరకుండా, తిట్టకుండా చెబుతారు. అర్థం కాలేదంటే విసుక్కోరు. మళ్ళీ చెబుతారు. వారు చెప్పే తీరు చాలా బాగుంటుంది. వారంతా నాకు పూజ్యులే.

ఇదే విధంగా నాకు చాలాసార్లు ‘స్త్రీ రత్నములు పూజ్యులు’ అనిపించింది.

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.

అ. పాఠ్యాంశాన్ని “ఏకాంకిక” రూపంలో రాసి ప్రదర్శించండి.

ఆ. ఈ పాఠం ఆధారంగా స్త్రీల పట్ల మనం ఎలా ప్రవర్తించాలో, మన బాధ్యతలు ఏమిటో తెలిపేలా నినాదాలు / సూక్తులు రాయండి.

## III. భాషాంశాలు

పదజాలం

1. కింది పర్యాయ పదాలకు సంబంధించిన పదాన్ని పాఠంలో గుర్తించి గడిలో రాయండి.

అ. <u>ఆజ్ఞ</u> – ఆదేశము, ఆన, ఉత్తరువు, నిర్దేశము.

ఆ. <u>కన్ను</u> – అక్షి, చక్షువు, నేత్రము, నయనము.

ఇ. .............. – అగ్ని, నిప్పు, వహ్ని, జ్వలనము.

ఈ. ............ – మగువ, కొమ్మ, ఇంతి, పడతి.

2. కింది ఆధారాలను బట్టి గళ్ళను పూరించండి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | ■ | 4 | |
| ■ | ■ | | ■ | 5 | | | ■ | ■ |
| 6 | | | | ■ | | ■ | ■ | 7 |
| | ■ | | ■ | | ■ | 9 | | |
| | ■ | ■ | ■ | | ■ | ■ | ■ | |
| 10 | | 11 | | ■ | 12 | 13 | | |
| ■ | ■ | | ■ | 14 | ■ | | ■ | ■ |

అడ్డం

1. సీతకు అగ్నిగుండం కూడా ఇలా ఉంటుంది. (4)
4. 'అంబుదం' దీన్నే ఇలా కూడా అంటారు. (2)
5. సావిత్రి చరిత్ర విశేషణం (3)
6. పాపం కాదు పుణ్యానికి నిలయం (4)
9. కుడివైపు నుండి సీతకు మరో పేరు (3)
10. కుడివైపు నుండి శివాజీ కోపించిన సేనాని (4)
12. ఈ పాఠం కవి ఇంటి పేరు (4)
14. పాఠంలో శివాజీ తొలిపలుకు (1)

నిలువు

2. సోన్‌దేవుడు దీనిని బంధించాడనే శివాజీ కోపించింది (4)
3. శివాజీ గౌరవించిన కాంత వంశం (3)
6. రావణుని తాత (4)
7. యవన కాంత స్వస్థలం (4)
8. సోన్‌దేవుని మదోన్మాదానికి కారణం (2)
11. శివాజీని సోన్‌దేవుడు పిలిచినట్టు మీరూ పిలవండి. (2)
13. శీర్షాసనం వేసిన త్వరితం, వేగం (2)

3. కింది ప్రకృతులకు సరైన వికృతులను జతపరచండి.

| | ప్రకృతి | | వికృతి |
|---|---|---|---|
| అ. | రాజ్ఞి | ( 4 ) | 1. ఆన |
| ఆ. | ఆజ్ఞ | ( 1 ) | 2. రతనము |
| ఇ. | ఛాయ | ( 5 ) | 3. బత్తి |
| ఈ. | రత్నము | ( 2 ) | 4. రాణి |
| ఉ. | భక్తి | ( 3 ) | 5. చాయ |

4. కింది పదాల్లోని ప్రకృతి - వికృతి పదాలను వేరుచేసి రాయండి.

గౌరవము బమ్మ పుణ్యము బ్రహ్మ జోతి పున్నెం
రాసి గీము జ్యోతి దోషము గృహము అంబ
అమ్మ భాగ్యము దోసము గారవము రాశి బాగ్గెము

| ప్రకృతి | | వికృతి | ప్రకృతి | | వికృతి |
|---|---|---|---|---|---|
| గౌరవము | - | గారవము | బ్రహ్మ | - | బమ్మ |
| పుణ్యము | - | పున్నెం | జ్యోతి | - | జోతి |
| రాశి | - | రాసి | గృహము | - | గీము |
| అంబ | - | అమ్మ | భాగ్యము | - | బాగ్గెము |
| దోషము | - | దోసము | | | |

## వ్యాకరణాంశాలు

1. కింది పదాలు పరిశీలించండి. వాటిలో సవర్ణదీర్ఘ, గుణ, వృద్ధి సంధులున్నాయి. గుర్తించి, విడదీసి సూత్రాలు రాయండి.

సవర్ణదీర్ఘసంధి :

అ. పుణ్యావాసము = పుణ్య + ఆవాసము = (అ + ఆ = ఆ)
ఇ. స్నిగ్ధాంబుద = స్నిగ్ధ + అంబుద = (అ + అ = ఆ)

గుణసంధి :

ఆ. మదోన్మాదము = మద + ఉన్మాదము = (అ + ఉ = ఓ)
ఈ. సరభసోత్సాహం = సరభస + ఉత్సాహం = (అ + ఉ = ఓ)

వృద్ధిసంధి :

ఉ. గుణౌద్ధత్యం = గుణ + ఔద్ధత్యం = (అ + ఔ = ఔ)
ఊ. రసైక స్థితి = రస + ఏకస్థితి = (అ + ఏ = ఐ)

2. కింది పదాల్లో ఉత్వ, త్రిక, రుగాగమ, లులనల సంధులున్నాయి. పదాలు విడదీసి, సంధి జరిగిన తీరును చర్చించండి.

(అ) బంధమూడ్చి (ఆ) అవ్వారల (ఇ) భక్తురాలు (ఈ) బాలెంతరాలు (ఉ) గుణవంతురాలు (ఊ) దేశాలలో

www.sakshieducation.com

(ఋ) పుస్తకాలు (ౠ) సమయాన

ఉత్వసంధి :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| అ) బంధమూడ్చి | = | బంధము | + | ఊడ్చి | = | (ఉ + ఊ = ఊ) |

త్రికసంధి :

| | | | | |
|---|---|---|---|---|
| ఆ) అవ్వారల | = | ఆ | + | వారల |

రుగాగమసంధి :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఇ) భక్తురాలు | = | భక్త | + | ఆలు | = | భక్తురు(క్) + ఆలు |
| ఈ) బాలెంతరాలు | = | బాలెంత | + | ఆలు | | |
| ఉ) గుణవంతురాలు | = | గుణవంత | + | ఆలు | = | గుణవంతురు(క్) + ఆలు |

లు,ల,న,ల సంధి :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఊ) దేశాలలో | = | దేశము | + | లలో | = | ('ము' లోపం – దాని పూర్వపు 'శ'కు దీర్ఘం వచ్చింది) |
| ఋ) పుస్తకాలు | = | పుస్తకము | + | లు | = | ('ము' లోపం – దాని పూర్వపు 'క'కు దీర్ఘం వచ్చింది) |
| ౠ) సమయాన | = | సమయము | + | న | = | ('ము' లోపం – దాని పూర్వపు 'య'కు దీర్ఘం వచ్చింది) |

3. కింది పద్యపాదాల్లోని అలంకారాన్ని గుర్తించండి. లక్షణాలను సరిచూసుకోండి.
   అ. అనుచున్ జేవుఋమీఋ కన్నుఁగవతో, నాస్పందదోష్ఠంబుతో ఘన హుంకారముతో నటద్భ్రుకుటితో, గర్జిల్లునా భోస్‌సలేశుని జూడన్............
4. కింది పద్యపాదాలకు గురులఘువులను గుర్తించి, గణవిభజనచేసి, అవి ఏ పద్యాలకు సంబంధించినవో నిర్ణయించండి. లక్షణాలను చర్చించండి.
   అ. ఆ – యేమీ యొకరాణివాసమును బుణ్యావాసమున్ దెచ్చినా
   ఆ. అనల

జ్యోతుల నీ పతివ్రతలఁ బాపాచారులైడాయు భూ

5. కింది పదాలను విడదీయండి.
   అ. వాఙ్మయం = వాక్ + మయం = వాఙ్మయం = 'క్' స్థానంలో 'ఙ' వచ్చింది.
   ఆ. రాణ్మహేంద్రవరం = రాట్ + మహేంద్రవరం = రాణ్మహేంద్రవరం = 'ట్' స్థానంలో 'ణ' వచ్చింది.
   ఇ. జగన్నాథుడు = జగత్ + నాథుడు = జగన్నాథుడు = 'త్' స్థానంలో 'న' వచ్చింది.
   పై మూడు సందర్భాల్లో పూర్వపదాంతంలో వరుసగా క, ట, త లున్నాయి.
   వాటికి 'మ' గాని, 'న' గాని పరమయినాయి –
   అప్పుడు పదాంతంలోని 'క' కారం కవర్గ అనునాసికమైన 'ఙ' (క ఖ గ ఘ 'ఙ') గాను, 'ట' కారం దాని అనునాసికమైన 'ణ' (ట, ఠ, డ, ఢ, 'ణ') గాను, 'త' కారం దాని అనునాసికమైన 'న' (త థ ద ధ 'న') గాను మారాయి. దీన్ననుసరించి –
   వర్గప్రథమాక్షరాలకు (క, చ, ట, త, ప లకు) 'న' గాని, 'మ' గాని పరమైనప్పుడు అదేవర్గ అనునాసికాలు ఆదేశమవుతాయి. దీన్నే 'అనునాసిక సంధి' అంటారు.
   కింది పదాలను విడదీసి, అనునాసిక సంధి సూత్రంతో అన్వయించి చూడండి.
   అ) తన్మయము = తత్ + మయము – 'త్'కు బదులుగా 'మ' వచ్చింది.
   ఆ) రాణ్మణి = రాట్ + మణి – 'ట్' కు బదులుగా 'ణ' వచ్చింది.
   ఇ) మరున్నందనుడు = మరుత్ + నందనుడు – 'త్' కు బదులుగా 'న' వచ్చింది.
   అంటే క,చ,ట,త,ప వర్గాక్షరాలకు న,మ లు పరమైతే వాని అనునాసికాక్షరాలు వికల్పంగా వచ్చును.
6. ఉపజాతిపద్యాల్లో తేటగీతి, ఆటవెలది పద్యాల లక్షణాలను తెలుసుకున్నారు కదా! ఇప్పుడు సీసపద్య లక్షణాలను పరిశీలిద్దాం. సీసపద్యంలో ప్రతిపాదం రెండు భాగాలుగా ఉంటుంది. ప్రతిభాగంలో నాల్గేసి గణాల చొప్పున ఒక్కొక్క పాదంలో ఎనిమిది గణాలుంటాయి. ఈ 8 గణాల్లో మొదటి ఆరు ఇంద్రగణాలు. చివరి రెండు సూర్యగణాలు. (పాదం మొదటి భాగంలో 4 ఇంద్రగణాలు, 2వ భాగంలో వరుసగా రెండు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలుంటాయి.)

   యతి ప్రతిపాదంలోనూ 3వ గణం మొదటి అక్షరంతో సరిపోతుంది. యతిలేని చోట ప్రాసయతి చెల్లుతుంది.
   పై పాదంలో ప్రాసయతిని గమనించారు కదా!
   ప్రాసనియమం లేదు.
   సీసపద్యం నాల్గుపాదాల తర్వాత తేటగీతిగాని, ఆటవెలదిగాని తప్పనిసరిగా ఉంటుంది.
   ఈ కింది పద్యపాదాన్ని గణవిభజన చేసి లక్షణ సమన్వయం చేయండి.

   ధగధగద్ధహన మధ్యమ పూలరాసిగా
   విహరించియున్న సాధ్వీమతల్లి.

   మీ పాఠంలోని 5వ పద్యం సీసం. ఆ పద్యం లక్షణాలను సరిచూడండి.

సూక్తి

యత్రనార్యస్తు పూజ్యంతే, రమంతే తత్రదేవతా:
యత్రైతాస్తు నపూజ్యంతే, సర్వాస్తత్రా ఫలా:క్రియా:
స్త్రీలను పూజించేచోటనే దేవతలు ఆనందిస్తారు. స్త్రీలను
గౌరవించనిచోట జరిగే సర్వక్రియలూ నిష్ఫలములే.